క్లుప్తంగా

సప్లిమెంటరీ పరీక్షలకు రెండు కేంద్రాలు



పీఎం పాలెం పోలీస్ స్టేషన్ వద్ద పరీక్ష పేపర్లతో ఉపాధ్యాయులు

మధురవాడ : ఈ నెల 24 నుంచి జరగనున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌కి పరీక్షా పత్రాలు చేరాయి. వీటిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. మధురవాడ పరిసర ప్రాంతాల్లో కేవలం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మాత్రమే 2 కేంద్రాలు కేటాయించారు. ఈ ఏడాది పరీక్ష తప్పిన 271 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్టు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సోమయాజులు తెలిపారు. ఇక్కడి 2 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆయన తెలిపారు.

నాలుగు రోజులుగా తాగునీరు వృథా



ఊళ్లపేటలో పగిలిన పైప్‌లైన్ నుంచి వృథాగా పోతున్న తాగునీరు

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు సంగివలస అనిట్స్ రహదారిలోని ఊళ్లపేట వద్ద పైప్‌లైన్ పగిలి నాలుగు రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. అమృత గరల్స్ హాస్టల్ సమీపంలో స్థానికులు కొందరు జేసీబీతో ఉద్దేశ్యపూర్వకంగా పైప్‌లైన్‌ను పగలగొట్టినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతవాసులు తీవ్రమైన తాగునీటి కొరతతో ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ సిబ్బంది వెంటనే స్పందించి పగిలిన పైప్‌లైన్‌ను సరి చేయాలని కోరుతున్నారు.

రైతులకు పీఎండీఎస్ కిట్లు పంపిణీ



పాలవలసలో రైతులకు పీఎండీఎస్ కిట్లు పంపిణీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

తగరపువలస : ఆనందపురం మండలం తర్లువాడ యూనిట్ పాలవలసలో సోమవారం ప్రకృతి వ్యవసాయ అధికారులు రైతులకు ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) విత్తనాల కిట్లు పంపిణీ చేశారు. అనంతరం రీజినల్ అధికారి ప్రకాష్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహన్‌రావు పీఎండీఎస్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ విధానంలో 365 రోజులు నవధాన్యాలను భూమిలో కప్పి ఉంచడం వల్ల సారవంతంగా ఉండటంతోపాటు రైతులకు ఏడాది పొడవునా ఆదాయం లభిస్తుందన్నారు. పంటల మార్పిడి కారణంగా పురుగులు, తెగుళ్ల భారి నుంచి ప్రధాన పంటలను కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ చక్రవర్తి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ఏపీ జెన్‌కో ఎండీ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం ఏపీ జెన్‌కో ఎండీ చక్రధరబాబు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

అభివృద్ధి పరవళ్లు

- రూ.5 కోట్లతో ఎండాడ లా కాలేజీ రోడ్డు నిర్మాణం
- రూ.12 లక్షలతో జంక్షన్ సుందరీకరణ
- అదే కూడలిలో రూ.23 లక్షలతో ఆధునిక బస్టాప్ నిర్మాణం



సుందరంగా తీర్చిదిద్దిన బస్ బే



నిర్మాణం పూర్తయిన ఎండాడ లా కళాశాల రోడ్డు



అభివృద్ధి చేసిన లా కళాశాల జంక్షన్

మధురవాడ : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మధురవాడ పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా అభివృద్ధి పనులు జోరుగా సాగాయి. ఈ ఒక్క ప్రాంతంలోనే సుమారు రూ.100 కోట్లకు పైగా విలువ చేసే పనులు జరిగాయి. కొద్ది నెలలుగా జీవీఎంసీ 8వ వార్డు పరిధి ఎండాడ లా కళాశాల రోడ్డు, జంక్షన్‌ని అనుకుని చిన్న జంక్షన్‌లో రూ.5.35 కోట్లతో అభివృద్ధి పనులు అత్యంత సుందరంగా చేపట్టారు. ఎన్నికల కోడ్ తొలగిపోతే అధికారికంగా ఇవన్నీ అందుబాటులోకి రానున్నాయి. జీవీఎంసీ 8వ వార్డులోని లా కళాశాల జంక్షన్ ఎంతో కీలకమైన ప్రాంతం. ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంతోపాటు, ముఖ్యమైన గేటెడ్ కమ్యూనిటీలు, విద్యా సంస్థలు, బీచ్‌ని కలిపే జంక్షన్ అయినప్పటికీ కొన్నేళ్ల క్రితం వరకు ఇక్కడ కనీసం బస్సు షెల్టర్ కూడా సక్రమంగా లేని పరిస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాది నుంచి ఈ ప్రాంతం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ఇక్కడి ఎండాడ లా కళాశాల జంక్షన్‌ని సుమారు రూ.12 లక్షలతో సుందరంగా అభివృద్ధి చేశారు. జాతీయ రహదారి నుంచి బీచ్ రోడ్డును 3.1 కిలో మీటర్ల మేర కలుపుతూ రూ.5 కోట్లతో మాస్టర్ ప్లాన్ రహదారి విస్తరణ, ఫుట్‌పాత్‌లు నిర్మించారు. ఇదే జంక్షన్‌లో అత్యంత సుందరంగా అధునాతన బస్ బేను రూ.23 లక్షలతో నిర్మించారు. ఈ పనులన్నీ పూర్తి కావడంతో ఎంవీవీ సిటీ, పనోరమా హిల్స్, పీఎం పాలెం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఏసీఏ – వీడీసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం, వి కన్వెన్షన్ పరిసర ప్రాంతాల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సుందరంగా తీర్చిదిద్దారు



లా కళాశాల రోడ్డు, ఎంవీవీ సిటీ, ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం పరిసర ప్రాంతాల్లో రోడ్లు, అధునాతన బస్టాప్, లా కాలేజీ జంక్షన్ అభివృద్ధి, లా కాలేజీ – రుషికొండ మాస్టర్ ప్లాన్ రోడ్లు చాలా బాగా అభివృద్ధి చేశారు. కొద్ది నెలల కిందట హైవే – ఎంవీవీ సిటీ రోడ్డు కూడా చాలా చక్కగా అభివృద్ధి చేశారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి అయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చాలా ఆనందంగా ఉంది.

– కిషోర్, ప్రకృతి ప్రేమికుడు, ఎంవీవీ సిటీ

అన్నిప్రాంతాల్లోనూ ప్రగతి



మధురవాడ పరిసర ప్రాంతాల్లోనే కాదు.. ఎక్కడ చూసినా అభివృద్ధి పనులు చాలా ఎక్కువగానే కనిపిస్తున్నాయి. నేను గతంలో ఎప్పుడూ ఇలాంటి అభివృద్ధి చూడలేదు. చాలా ఆనందంగా ఉంది. త్వరలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖ నుంచే పాలన సాగించనున్నారు. అప్పటి నుంచి అభివృద్ధి మరింత పరుగులు పెడుతుంది.

– వాండ్రాసి కోమల్ సాయి, మధురవాడ

22 నుంచి రాజ్యలక్ష్మి ఉత్సవాలు



గెద్దపేటలోని రాజ్యలక్ష్మి ఆలయం



రాజ్యలక్ష్మి విగ్రహం

పద్మనాభం : మండలంలోని కోరాడ పంచాయతీ గెద్దపేటలో 13 ఏళ్ల తర్వాత రాజ్యలక్ష్మి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. 2011లో గ్రామంలో ఉత్సవాలు నిర్వహించారు. మళ్లీ ఇప్పుడు ఉత్సవాల నిర్వహణకు కమిటీ ఏర్పాట్లు చేసింది. 22న తొలేళ్ల ఉత్సవంలో భాగంగా అమ్మవారి ప్రతిమలైన ఘటాలను గ్రామంలో ఊరేగిస్తారు. 23న వ్యవసాయ బళ్లను రథాలుగా తీర్చిదిద్ది రథోత్సవం నిర్వహిస్తారు. అంజలి రథంతోపాటు మూడు రథాలను గ్రామంలో ఊరేగిస్తారు. అనంతరం గ్రామస్తులు ఉయ్యాల ఊగుతారు. చిడతలు, తప్పెటగుళ్ల వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 24న ముగింపు ఉత్సవం నిర్వహిస్తారు.

గంభీరం రిజర్వాయర్ రోడ్డులో కాంక్రీట్ వ్యర్థాల డంపింగ్



రోడ్డుపై డంప్ చేసిన కాంక్రీట్ వ్యర్థాలు



మధురవాడ : జీవీఎంసీ 5వ వార్డు శివారు ప్రాంతం కంబాలకొండ రిజర్వ్ ఫారెస్టు ఒక వైపు, జాతీయ రహదారి ఒక వైపు హద్దులుగా ఉన్న గంభీరం రిజర్వాయర్ మాస్టర్ ప్లాన్ రోడ్డు పరిసర ప్రాంతాలు సిమెంట్, కాంక్రీట్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. పరదేశిపాలెం, మధురవాడ, మారికవలస – తిమ్మాపురం మాస్టర్ ప్లాన్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆర్‌సీసీ మిక్సింగ్ ప్లాంట్‌లకు చెందిన వాహనాలతో వ్యర్థాలు తీసుకొచ్చి ఇష్టానుసారంగా డంపింగ్ చేసేస్తున్నారు. దీంతో విలువైన జీవీఎంసీ పార్కు, పరదేశిపాలెం శ్మశాన వాటిక స్థలం కలుషితం కావడంతోపాటు, దుమ్ము ధూళి ఎగసిపడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఈ ధూళి జాతీయ రహదారిపైకి చేరి పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పార్కు, శ్మశాన వాటిక స్థలం రక్షించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అందుబాటులోకి రక్తం నిల్వ యూనిట్

అత్యవసర వేళల్లో రోగులకు ఉపయోగం



రక్తాన్ని భద్రపరిచే యునిట్

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తాన్ని నిల్వ చేసుకునే యూనిట్ అందుబాటులోకి వచ్చింది. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల ప్రజల వైద్య అవసరాల కోసం భీమిలిలోని 30 పడకల ప్రధాన ఆస్పత్రి ఎంతో కీలకం. దీంతో అయా ప్రాంతాల్లో తరచూ జరిగే ప్రమాదాల్లో గాయపడే వారు చికిత్స నిమిత్తం ఇక్కడికే వస్తుంటారు. వీరిలో అవసరమైన వారికి రక్తం అందివ్వాలంటే ఇక్కడ గతంలో ఆ సదుపాయం లేదు. దీంతో తప్పనిసరిగా విశాఖకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడేది. ఇదేకాకుండా అవసరమైన గర్భిణులకు శస్త్ర చికిత్సలు నిర్వహించాలన్నా రక్తం నిల్వ యూనిట్ అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ సమస్యపై ప్రజలు గతంలో ఎన్నోసార్లు అధికారులు, ప్రభుత్వానికి తెలియజేసినా ఉపయోగం లేకుండా పోయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రక్తం నిల్వ చేసుకునే యూనిట్‌ను మంజూరు చేయడంతోపాటు దాన్ని ఇటీవల ఆస్పత్రికి పంపించారు. ప్రస్తుతం ఇది వినియోగంలోకి రావడంతో విశాఖ విక్టోరియా జనరల్ ఆస్పత్రి నుంచి పలు గ్రూప్‌ల రక్తం ప్యాకెట్లను అందిస్తున్నారు. వాటిని అవసరమైన వారికి ఇక్కడి వైద్యులు వినియోగిస్తున్నారు. అవి అయిపోయే సమయానికి మళ్లీ కొత్తవాటిని పంపుతున్నారు. ఇప్పటికే ఇక్కడ నిల్వ చేసిన రక్తాన్ని పలువురు రోగుల కోసం వినియోగించారు. ఇంకా ఏ సమయంలోనైనా వినియోగించడానికి రక్తం సిద్ధంగా వుంది. ఇప్పటి వరకు రక్తం నిల్వ చేసుకునే సదుపాయం అందుబాటులో లేని కారణంతో రోగులు ఎంతో శ్రమతో విశాఖకు వెళ్లిపోవాల్సి వచ్చేది. ప్రస్తుతం రక్తం అందుబాటులో ఉండడంతో అందరికీ ఎంతో ప్రయోజనకరంగా ఉంది. ఇన్నాళ్లూ లేని మంచి సదుపాయం అందుబాటులోకి తీసుకురావడంతో ప్రజలంతా ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

శస్త్రచికిత్సలకు వీధి కుక్కల తరలింపు



సంతపేటలో పిచ్చికుక్కను బంధిస్తున్న సిబ్బంది

తగరపువలస : జీవీఎంసీ సిబ్బంది భీమిలి జోన్‌లో మూడు రోజులుగా వీధి కుక్కలను బంధించి మధురవాడలోని శస్త్ర చికిత్సలకు తరలిస్తున్నారు. ఆదివారం సంతపేటలో ఒక పిచ్చికుక్క ముగ్గురిపై దాడి చేసి గాయపరచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 18న 'బెంబేలెత్తిస్తున్న వీధికుక్కలు', 20న 'పిచ్చికుక్క స్వైరవిహారం' శీర్షికలతో సాక్షిలో వరుసగా వార్తలు ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన శానిటేషన్ అధికారులు మూడు రోజులుగా సిబ్బందిని రప్పించి కుక్కలను బంధించి ప్రత్యేక వ్యాన్‌లో తరలిస్తున్నారు. ఆదివారం సంతపేటలో ముగ్గురిని గాయపరచిన పిచ్చికుక్కను సైతం సోమవారం బంధించారు. ఇకపై కుక్కల బెడద తగ్గేవరకు ఏరివేత కొనసాగిస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మినాయుడు, సెక్రటరీ మనోజ్‌కుమార్ తెలిపారు.

గొల్లలపాలెం పాఠశాలకు ఇటుక బట్టీల సెగ



గ్రీన్ మ్యాట్‌తో పాఠశాలను కప్పి ఉంచిన దృశ్యం



పాఠశాల వెనుక జారిపోయిన గ్రీన్ మ్యాట్

తగరపువలస : భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ గొల్లలపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఇటుక బట్టీల సెగ తగులుతోంది. పాఠశాలకు, ఇటుక బట్టీలకు మధ్య బీటీ రోడ్డే హద్దు కావడంతో ఇటుకల తయారీతో వెలువడే కాలుష్యంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. తయారీలో వినియోగించే బొగ్గు, బట్టీలు కాల్చేటప్పుడు రేణువులు, వేడి, పొగ చదువుపై విద్యార్థుల ఏకాగ్రతను దెబ్బతీస్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజన సమయంలో మరీ ఇబ్బంది పడుతున్నారు. శ్వాసకు సంబంధించిన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బట్టీల యజమాని తాత్కాలికంగా పాఠశాల చుట్టూ గ్రీన్ మ్యాట్‌లు ఏర్పాటు చేసినా అవి కాలుష్యాన్ని నిలువరించలేకపోతున్నాయి. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 'నాడు – నేడు' పథకం ద్వారా ఈ పాఠశాలకు రూ.18 లక్షలతో వసతులు కూడా కల్పించారు. కాలుష్యం కారణంగా పాఠశాల పరిసరాలు పాడవుతున్నాయని స్థానికులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. జూన్‌లో పాఠశాలల పునఃప్రారంభానికి ముందే ఇటుక బట్టీల కాలుష్యం నుంచి పాఠశాలకు విముక్తి కలిగించేలా విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎగువపేట వేదిక సిద్ధం

రూ.20 లక్షలతో నిర్మాణం పూర్తి



నిర్మాణం పూర్తయిన వేదిక

భీమునిపట్నం : భీమిలిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను అనుకున్న సమయానికి ప్రభుత్వం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చింది. అందులో ఎగువపేట వేదిక కూడా ఒకటి. ఇక్కడ మత్స్యకారులు నివసించే ఎగువపేట, పక్కనే ఉన్న బోయివీధి, దాని చుట్టుపక్కల ప్రాంతాల వారి కోసం 30 సంవత్సరాల క్రితం గ్రామదేవత శ్రీనూకాలమ్మ ఆలయం పక్కన ఉన్న స్థలంలో ఒక వేదిక నిర్మించారు. ప్రతి సంవత్సరం గ్రామ దేవత ఉత్సవాలు జరిగే సమయాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఇక్కడ నిర్వహిస్తారు. దీంతోపాటు పలు బహిరంగ సమావేశాలు, కార్యక్రమాలు కూడా జరుగుతాయి. అయితే పది సంవత్సరాల క్రితం బాగా దెబ్బతిని పాడైపోయినా ఎవరూ పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో కొన్నాళ్ల కిందట జీవీఎంసీ అధికారులు స్పందించి వేదిక పునర్నిర్మాణానికి అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి పంపారు. వెంటనే స్పందించిన ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసింది. దీంతో పాడైపోయిన వేదికను మూడు నెలల క్రితం కూల్చివేసి దాని స్థానంలో కొత్త వేదిక నిర్మాణ పనులు ప్రారంభించారు. నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకుండా ఎంతో పటిష్టంగా నిర్మాణ పనులు పూర్తి చేశారు. సంవత్సరాల తరబడి ఎవరూ దీన్ని పట్టించుకోలేదని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కొత్త వేదిక నిర్మించడం సంతోషకరమని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కనకమహాలక్ష్మికి స్వర్ణ పుష్పార్చన నేడు

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. లేదా ఇ–మెయిల్ ఐడీ endow- eokanaka@gov.in ద్వారా తెలుసుకోవచ్చు.

పర్యావరణ పరిరక్షణకు కార్యక్రమాలు



అవగాహన కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ సత్యనారాయణ, శ్యాంప్రసాద్

డాబాగార్డెన్స్ : మానవ హక్కులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించినట్టు డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ ప్రొఫెసర్ వై.సత్యనారాయణ తెలిపారు. మానవ హక్కుల కౌన్సిల్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడేందుకు కాలుష్య నియంత్రణ మండలి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా పలు ఫార్మా, పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య నియంత్రణపై జిల్లా అధికార యంత్రాంగంతోపాటు జీవీఎంసీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ పోర్టు, స్టీల్ ప్లాంట్, ఇతర ఫార్మా కంపెనీల కారణంగా విశాఖ నగరంలో కాలుష్యం పెరిగిపోయిందన్నారు. ప్రతీ ప్రాంతంలోనూ గెడ్డలు, కాలువలను కాపాడుకోవాలన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను పక్కాగా అమలు చేసే క్రమంలోనే మానవ హక్కుల కౌన్సిల్ కూడా భాగస్వామ్యమై అవగాహన కార్యక్రమాలు చేపడతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా మానవ హక్కుల కౌన్సిల్ నేతృత్వంలో చేపట్టబోయే అవగాహన కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏయూ గాంధీయన్ విద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సీతామాణిక్యం, మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు ఎస్‌వీ రమణ, పైడిరాజురెడ్డి, ఎన్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దుదాం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



సైకిల్‌పై జీవీఎంసీకి వస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్ : వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను ఉపయోగించి నగరంలో కాలుష్యాన్ని అరికట్టేందుకు, విశాఖను కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు నగర ప్రజలు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు. తన బంగ్లా నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సోమవారం ఆయన సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను ఉపయోగించాలనే నిర్ణయం మేరకు అధికారులు, సిబ్బంది ప్రజా రవాణాను ఉపయోగిస్తున్నారన్నారు. ఎకో – వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో – జీరో పొల్యూషన్‌లో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు ఇప్పటికే చేపట్టి అమలు చేస్తోందన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించాలని కోరారు. అందరూ వారంలో ఒక్కరోజు ప్రజా రవాణాను ఉపయోగించడం ద్వారా విశాఖ నగరంలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించేందుకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు. • శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు. • శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠంపజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.



జీలకర్ర,బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

నమో శివ రుద్రాయ

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. అడవివరం, విజినిగిరిపాలెం, కృష్ణానగర్ నుంచి భక్తులు తరలివచ్చి పరమేశ్వరుడికి అభిషేకాలు, పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

అన్నమయ్య సంకీర్తనల శిక్షణ ప్రారంభం



సంకీర్తనలు ఆలపిస్తున్న జ్యోతిర్మయి

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లోని భక్త తుకారాం ఆలయ ప్రాంగణంలో సోమవారం అన్నమయ్య సంకీర్తన శిక్షణ శిబిరం ప్రారంభమైంది. శ్రీవెంకటేశ్వర స్వామి సంకీర్తనల రాయబారి కొండవీటి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ నెల 24 వరకు శిబిరం కొనసాగుతుంది. ఈ శిక్షణలో పాల్గొన్న సుమారు 100 మందికి అన్నమయ్య సంకీర్తనల గురించి జ్యోతిర్మయి వివరించారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో భక్త తుకారాం విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు.